ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



తెలంగాణ సంగారెడ్డిలో చైనా మాంజాకు ఉత్తరప్రదేశ్ వాసి బలి

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 191 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 15 - 01 - 2026




### కేసీఆర్‌ను విమర్శించడానికి

# మేం అవసరం లేదు.. ఆమె చాలు

- కేసీఆర్‌ను విమర్శించడానికి కల్వకుంట్ల కవిత సరిపోతారన్న మంత్రి కోమటిరెడ్డి
- రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని ఆరోపణ
- కేసీఆర్ చేసిన అప్పులను తీరుస్తున్నామన్న మంత్రి
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి
- కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే, వాటిని తమ ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తోంది
- అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుంచుకోవాలని హెచ్చరిక



హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించేందుకు తాము అవసరం లేదని, ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరిపోతారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే, వాటిని తమ ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు.అప్పులు తీరుస్తూనే రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ వల్ల పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, - మిగతా 2 లో




ములుగు జిల్లాను తొలగిస్తారనే

## ప్రచారాన్ని విశ్వసించవద్దు

- ములుగు జిల్లాను తొలగిస్తున్నారని ప్రచారం
- స్పందించిన మంత్రి సీతక్క
- ములుగు జిల్లాను తొలగిస్తారనే ప్రచారాన్ని విశ్వసించవద్దన్న మంత్రి
- పలు యూట్యూబ్ ఛానళ్ల ద్వారా జిల్లాపై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని విమర్శ
- జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ

### అంతర్జాతీయ పండుగగా

# 'పొంగల్' పండుగ

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో నేనూ ఒకడిని
- తమిళనాడు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రశంసించిన మోదీ
- తమిళ సంస్కృతి యావత్ దేశ ఉమ్మడి సంస్కృతి
- సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మోదీ
- కేంద్ర మంత్రి నివాసంలో పొంగల్ వండిన ప్రధాని నరేంద్ర మోదీ



ఢిల్లీ : ఇప్పుడు 'పొంగల్' అంతర్జాతీయ పండుగగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. తమిళులతో పాటు యావత్ ప్రపంచంలో తమిళ సంస్కృతిని ప్రేమించే వారు ఆనందోత్సాహాలతో పొంగల్ వేడుకను జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. తమిళ సంస్కృతిని ప్రేమించే వారిలో తాను కూడా ఒకడినని మోదీ తెలిపారు. అందరితో కలిసి పొంగల్ వేడుకలలో భాగం కావడాన్ని తాను ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, బ్యూరోక్రాట్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.పొంగల్ పండుగ మన జీవితానికి ఆనందకర అనుభవాన్ని ప్రసాదిస్తుందని మోదీ అన్నారు. అన్నదాతల శ్రమను గుర్తిస్తూ, ప్రకృతి మాతకు, పుడమి తల్లికి, సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలుపుకునే అపురూప సందర్భం పొంగల్ అని ఆయన కొనియాడారు. ప్రకృతి, కుటుంబం, సమాజం మధ్య సమతూకాన్ని పాటించే బాటను ఈ పండుగ చూపిస్తుందన్నారు. - మిగతా 2 లో

### తక్షణమే

# ఇరాన్‌ను వీడండి




- భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు
- ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- కీలక ఆదేశాలు జారీ చేసిన భారత రాయబార కార్యాలయం
- అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచన
- తదుపరి నోటీసు వచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణం చేయవద్దని భారత విదేశాంగ శాఖ కూడా సూచన
- విదేశాంగ శాఖ ఇంతకుముందు కూడా ఇలాంటి నోటీసు జారీ




రైలుపై భారీ క్రేన్ పడి

## 22 మంది మృతి

- మరో 30 మందికి గాయాలు
- థాయ్‌లాండ్‌లో కదులుతున్న రైలుపై క్రేన్ జారిపడి పెను ప్రమాదం
- భారీ క్రేన్ మీద పడటంతో పట్టాలు తప్పిన ప్యాసింజర్
- ప్రమాదం జరిగిన వెంటనే రైలులో చెలరేగిన మంటలు
- ప్రమాద సమయంలో రైలులో 195 మంది ప్రయాణికులు

## మంత్రి లోకేశ్ 81వ రోజు ప్రజాదర్బార్




- పెద్దఎత్తున తరలివచ్చి వినతులు సమర్పించిన ప్రజలు
- భూ వివాదాలు, ఉద్యోగ సమస్యలు, టీటీడీ విధానాలపై పలు విజ్ఞప్తులు
- అందిన వినతులను పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ
- ప్రతి ఒక్కరినీ పలకరించి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్

### సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న వేళ

# గ్రంథాలయాలకు కొత్త రూపు

- విద్యార్థులు, ఉద్యోగార్థుల కోసం డిజిటల్ లైబ్రరీ
- డిజిటల్ నాలెడ్జ్ కేంద్రంగా మంగళగిరి లైబ్రరీ
- గ్రంథాలయమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, కెరీర్ నిర్మాణం, ఉద్యోగ పరీక్షలకు సిద్ధం చేసేలా ఈ లైబ్రరీ ఏర్పాటు
- ఎక్కువమంది విద్యార్థులు, ఉద్యోగార్థులు ఆధారపడేది గ్రంథాలయాల పైనే
- సాంకేతికత రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ గ్రంథాలయాలూ రూపు
- విద్యార్థులు, ఉద్యోగార్థుల కోసం హాల్‌తో పాటు రీడింగ్ రూమ్స్



అమరావతి : ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలు, వేటికైనా సంబంధిత అంశాలపై విద్యార్థులు పట్టు సాధించటం తప్పనిసరి. దీని కోసం ఎక్కువమంది విద్యార్థులు, ఉద్యోగార్థులు ఆధారపడేది గ్రంథాలయాల పైనే. ప్రస్తుతం సాంకేతికత రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ గ్రంథాలయాలూ రూపు మార్చుకుంటున్నాయి. ఆన్‌లైన్ పుస్తకాలకు, ఇంటర్నెట్ ద్వారా లభ్యమయ్యే సమాచారానికి ప్రస్తుతం డిమాండ్ పెరుగుతోంది. అందుకే డిజిటల్ లైబ్రరీలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంత్రి లోకేశ్ చొరవతో మంగళగిరిలో విద్యార్థులు, యువత, ఉద్యోగార్థుల కోసం డిజిటల్ లైబ్రరీ ప్రారంభమైంది.డిజిటల్ నాలెడ్జ్ కేంద్రంగా లైబ్రరీ : మంగళగిరి నియోజకవర్గం నుంచి ఎక్కువ సంఖ్యలో - మిగతా 2 లో

### ఏపీకి కేంద్రం

# నిధులు విడుదల




- 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఏపీకి నిధులు విడుదల చేసిన కేంద్రం
- ఏపీలో ఆరోగ్య రంగానికి రూ. 567 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- నిధుల వినియోగం పెరగడం పట్ల కేంద్రం సంతృప్తిని వ్యక్తం చేసిందన్న సత్యకుమార్
- మిగులు నిధుల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో చర్చలు ప్రారంభించాలని అధికారులకు ఆదేశం

# సంపాదకీయం

## మమత వీరంగం

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చౌర్యానికి పాల్పడ్డారని, వారి దుశ్చర్యలకు సీబీఐ విచారణతో అడ్డుకట్టవేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఐప్యాక్ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసం మీద ఈడీ దాడి చేయగానే, మమత పరుగుపరుగున వచ్చి, కొన్ని ఫైళ్ళను లాక్కుపోయిన పరిణామాల మీద సీబీఐ విచారణ జరపాలని న్యాయస్థానాలను ఈడీ డిమాండ్ చేస్తోంది. కోల్‌కతా హైకోర్టులో శుక్రవారం ఈడీ పిటిషన్ విచారణకు రాకుండా తృణమూల్ పార్టీ కోర్టులో తీవ్ర గందరగోళం సృష్టించి కుట్రచేసిందని కూడా సుప్రీంకోర్టుకు ఆ సంస్థ ఫిర్యాదుచేసింది. ఉద్రిక్తత, గందరగోళం మధ్యన పిటిషన్ల విచారణ సాధ్యం కాని స్థితిలో కోల్‌కతా హైకోర్టు దానిని 14వ తేదీకి వాయిదావేయడంతో సుప్రీంకోర్టును ఈడీ శరణుజొచ్చింది. వద్దువద్దని వారించినా, మా పనిలో జోక్యం మీకు తగదనీ, అది తప్పనీ హితవుచెప్పినా ప్రతీక్‌జైన్ ఇంట్లోకి మమత చొరబడ్డారని, తమ బృందానికి నాయకత్వం వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారినుంచి కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు, కీలక డాక్యుమెంట్లు ఆమె లాక్కుపోయారని ఈడీ ఆరోపణ. తాము సోదాలు జరిపిన ప్రాంగణం నుంచి ఆమె ఎత్తుకెళ్ళిన అన్ని రికార్డులను, ఆధారాలను వెంటనే సీజ్ చేయించి, ఫోరెన్సిక్ ప్రిజర్వేషన్‌కు ఆదేశించాలని సుప్రీంకోర్టును ఈడీ కోరింది.ఎన్నికలు దగ్గరపడుతున్న పశ్చిమబెంగాల్‌లో రాబోయేరోజుల్లో ఇటువంటి దృశ్యాలు, ఇంతకంటే నాటుగా ఉండబోయేవి కూడా అనేకం చూడబోతున్నాం. బొగ్గుకుంభకోణంలో మనీలాండరింగ్ కేసుమరింత లోతైన దర్యాప్తు పేరిట పశ్చిమబెంగాల్లో, అదీ తన పార్టీ రాజకీయవ్యూహాలను తయారుచేసే కన్సెల్టెన్సీలో ఈడీ కాలూనితే వీధిపోరాటాలకు మారుపేరైన మమత వీరంగం వేయకుండా ఉంటారా? పార్టీ కార్యకర్తలను, పోలీసు బలగాలను వెంటబెట్టుకొనిపోయి సోదాలు జరుగుతున్న ప్రదేశంలోకి స్వయంగా చొరబడి ఈడీ అధికారుల నుంచి ఫైళ్ళు లాక్కోవడం ఆమెకు తప్పు అనిపించలేదు. తృణమూల్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే సమాచారాన్నీ, రేపటి ఎన్నికల వ్యూహాలూ విజయ రహస్యాలనూ ఎత్తుకుపోవడమే ఈ దాడి అసలు లక్ష్యం కనుక, ఆ పార్టీ అధినేతగా ఈడీ దొంగిలించిన సమాచారాన్ని రక్షించుకోవడం, తిరిగి స్వాధీనం చేసుకోవడం తప్పెలా అవుతుందని ఆమె ప్రశ్న. పోరు నష్టం కాదు, రాజకీయంగా లాభమేనన్న ఆమె నమ్మకానికి నిదర్శనం.శారదా చిట్‌ఫండ్స్ కుంభకోణాన్ని దర్యాప్తు చేసిన ఒక ఉన్నతస్థాయి పోలీసు అధికారిని కాపాడుకోవడం కోసం 2019లో మమత ఏకంగా రోడ్డుమీద నిరసనకు కూర్చున్న దృశ్యాలు ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తున్నాయి. కోల్‌కతా పోలీసు చీఫ్ రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేయడానికి నలభైమంది సీబీఐ అధికారులు వస్తే, స్థానిక సీబీఐ కార్యాలయాన్ని రాష్ట్ర పోలీసులు చుట్టుముట్టి సోదాలు చేయడం, ప్రతిగా కేంద్ర బలగాలు అక్కడకు చేరుకోవడం వంటి దృశ్యాలు అంతవరకూ ఎవరూ చూడనివి, ఊహకు సైతం అందనివి. కోర్టు ఆదేశాలు లేకున్నా సీబీఐని మోదీ ప్రయోగించడం సరైనదే అయితే, వాటి నుంచి తాము లబ్ధిపొందడం ముఖ్యమైపోవడంతో ఇటువంటి దృశ్యాలు చూడవలసి వస్తున్నది.అనేక ఏళ్ళనాటి ఈ కేసులో సరిగ్గా ఎన్నికల ముందు కేంద్రం దాడులు, అరెస్టులకు ఉపక్రమించడం తప్పుడు సందేశాన్ని ఇస్తుంది. పదిహేనేళ్ళుగా అధికారం కోసం అర్రులు చాస్తూ, ఒక్కోమెట్టూ ఎక్కుతూ వచ్చిన బీజేపీ ఈమారు రాష్ట్రాన్ని గెలిచితీరాలన్న పట్టుదలతో పోరాడుతోంది. సదరు కన్సల్టెన్సీ సంస్థ నుంచి తృణమూల్ ఎన్నికల వ్యూహాలను తాము తస్కరించలేదన్న ఈడీ వాదన నిజమే అనుకున్నా, సోదాలు జరపడానికి అది ఎంచుకున్న సమయం వల్ల సామాన్యుడికి నమ్మకం కలగదు. ఇక, ఈ తరహా కేసులేవీ తీర్పులవరకూ, శిక్షలవరకూ రాకుండా కేవలం రాజకీయానికి ఉపకరించడమే చూస్తున్నాం. రాజకీయవైరాల మధ్య దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థలకూ, రాష్ట్ర పోలీసు యంత్రాంగాలకూ మధ్య ఘర్షణలు రేగడం సముచితం కాదు.

## సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న వేళ గ్రంథాలయాలకు కొత్త రూపు



**మొదటిపేజీ తరువాయి** – యువత ఉద్యోగాలు సాధించేలా మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులు, యువత కోసం స్థానిక గ్రంథాలయానికి ఆధునిక హంగులు కల్పించారు. మారుతున్న అవసరాలకు తగ్గట్లుగా సంప్రదాయ లైబ్రరీ భవనాన్ని పూర్తిగా రీమోడలింగ్ చేసి, డిజిటల్ నాలెడ్జ్ కేంద్రంగా లైబ్రరీని మార్చారు. ఇటీవలే లోకేష్ మంగళగిరిలో ఈ లైబ్రరీని ప్రారంభించారు. కేవలం గ్రంథాలయమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, కెరీర్ నిర్మాణం, ఉద్యోగ పరీక్షలకు సిద్ధం చేసేలా ఈ లైబ్రరీని తీర్చిదిద్దారు. విద్యార్థులు, ఉద్యోగార్థుల కోసం మొదటి అంతస్తులో హాల్‌తో పాటు రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షల పుస్తకాల విభాగంలో బ్యాంకింగ్, రైల్వేతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు సంబంధించిన సమాచారం, మెటీరియల్‌ను, పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడే డిజిటల్ లైబ్రరీని కూడా అందుబాటులోకి తెచ్చారు. లైబ్రరీలో కిడ్స్ లెర్నింగ్ విభాగం : అన్ని వయసుల వారికి అనువైన విధంగా లైబ్రరీలో సీటింగ్ ఏర్పాటు చేశారు. తెలుగు, ఇంగ్లీష్ పత్రికలతో పాటు జాతీయ పత్రికలు కూడా ఈ లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. పిల్లల కోసం ప్రత్యేకంగా లైబ్రరీలో కిడ్స్ లెర్నింగ్ విభాగం ఏర్పాటు చేశారు. చిన్న వయసులోనే చదువు మీద ఆసక్తి పెంచటంతో పాటు మొబైల్స్ నుంచి దారి మళ్లించి ఆటల ద్వారా మేధస్సు వికాసం పెంచేలా ఈ లైబ్రరీని తీర్చిదిద్దారు. లైబ్రరీలో కల్పించిన సౌకర్యాలపై యువత, విద్యార్థులు, ఉద్యోగార్థుల సంతోషం వ్యక్తం చేస్తోంది. ప్రశాంత వాతావరణం ఉండేలా సౌండ్ ప్రూఫ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఎక్కువసేపు చదవుకోవటానికి అనుకూలంగా లైటింగ్, గాలి సరిగా ప్రసరించేలా డిజిటల్ లైబ్రరీలో చర్యలు చేపట్టారు. లైబ్రరీకి వచ్చే వారికి తాగునీటి కోసం ప్రత్యేక ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

**మీకు తెలుసా? :**

పుస్తకాలు చదివితే జ్ఞానంతో పాటు అదనంగా మరెన్నో లాభాలున్నాయంటున్నాయి పలు అధ్యయనాలు.

మనకి ఇష్టమైన రంగానికి సంబంధించిన పుస్తకాలను రోజుకు ఓ గంటపాటు చదివితే ఐదేళ్లలో ఆ రంగంలో అంతర్జాతీయస్థాయి నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవచ్చుట.

సగటు పాఠకుడు ఏడాదికి సుమారు 33 పుస్తకాలు చదవగలడనీ, కాస్త వేగంగా చదివేవారు 55 వరకు చదువుతారనీ గణాంకాలు చెబుతున్నాయి.

మిస్టరీ, చరిత్ర, జీవితచరిత్రలు ఎక్కువగా చదువుతున్నారు. పాపులర్ సైన్స్, సైన్స్ ఫిక్షన్ చదివేవాళ్లు తక్కువే.

ప్రస్తుతం పురుషులకన్నా మహిళలే ఎక్కువ చదువుతున్నారు.

ప్రపంచంలో ఉన్న సంపన్నులు రోజూ అరగంటైనా వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన పుస్తకాలు చదువుతారట.

చిన్న పిల్లలచేత కథల పుస్తకాల్లాంటివి రోజూ కనీసం ఆరు నిమిషాలు చదివిస్తే చాలట, అది వాళ్ల జీవితంమీద గొప్ప ప్రభావాన్ని చూపుతుందట.

ఒత్తిడిని జయించడంలో పుస్తక పఠనం సంగీతంకన్నా 70శాతం ఎక్కువగా, వీడియో గేమ్స్ కన్నా ఆరు రెట్లు, టీకన్నా రెండింతలు బాగా పనిచేస్తుందట. ఆరునిమిషాల పాటు ఒక మంచి పుస్తకం చదివితే ఒత్తిడి అరవై శాతం తగ్గిపోతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

వృద్ధాప్యంలో డిమెన్షియా ఆల్జీమర్స్ లాంటి సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

## మంత్రి లోకేశ 81వ రోజు ప్రజాదర్బార్



**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 81వ రోజుకు చేరుకుంది. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలోని తన నివాసంలో భోగి పండుగ రోజున (బుధవారం) ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. పండుగ పూట ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ను కలిసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన లోకేశ్, వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ప్రజాదర్బార్‌లో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ సమస్యలు, స్థానిక అవసరాలపై వినతులు వెల్లువెత్తాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం బసినికొండ గ్రామానికి చెందిన పత్తి శివకుమార్, తమకు వారసత్వంగా సంక్రమించిన 1.83 ఎకరాల భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. అలాగే, రామసముద్రం మండలం బలిజపల్లికి చెందిన కె. పార్వతి, తమ రెండెకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మరోవైపు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు సంబంధించిన పలు అంశాలపై కూడా మంత్రికి విజ్ఞప్తులు అందాయి. తిరుమలలో అంగప్రదక్షణ కోసం ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి, భక్తుల సౌలభ్యం కోసం గతంలో మాదిరిగా ఆఫ్‌లైన్ టోకెన్లు జారీ చేయాలని 'తిరుమలలో అంగప్రదక్షణ భక్తబృందం' ప్రతినిధులు కోరారు. అదేవిధంగా, టీటీడీలో సొసైటీ విధానంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇతర ఉద్యోగులతో సమానంగా వైద్య సదుపాయం, శ్రీవారి దర్శనం కల్పించాలని సిబ్బంది విన్నవించుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు కోల్పోయిన వారు సైతం తమ గోడును మంత్రి లోకేశ్ ముందు వెళ్లబోసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో తొలగించిన 160 మంది కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ సూపర్‌వైజర్లకు తిరిగి ఉద్యోగావకాశం కల్పించాలని ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ కాంట్రాక్ట్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.తిరుపతి పరిసర ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న 150 ఎస్టీ ఎరుకల కుటుంబాలకు ఒకేచోట ఇళ్ల స్థలాలు కేటాయించాలని శ్రీ వేంకటేశ్వర ఎస్టీ ఎరుకల సంఘం విజ్ఞప్తి చేసింది. చిత్తూరు జిల్లా నింద్ర మండలం కచ్చరావేడు గ్రామంలో దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరారు.అందిన ప్రతి వినతిని ఓపికగా పరిశీలించిన మంత్రి లోకేశ్, సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజలు, కార్యకర్తలతో కలిసి ఫోటోలు దిగారు.

## 'పొంగల్' అంతర్జాతీయ పండుగగా మారింది

**మొదటిపేజీ తరువాయి** – నేల సారాన్ని కాపాడటం, జల పరిరక్షణ, భవిష్యత్ తరాల కోసం వనరుల సద్వినియోగం అవసరమని మోదీ తెలిపారు. ఈ విలువలను కాపాడేందుకే 'మిషన్ లైఫ్', 'ఏక్ పేడ్ మా కే నామ్', 'అమృత్ సరోవర్' లాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పొంగల్ లాంటి పండుగల వల్లే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి మరింత బలం చేకూరుతోందన్నారు.

**తమిళ సంస్కృతి యావత్ దేశ ఉమ్మడి సంస్కృతి**

'తమిళ సంస్కృతి కేవలం తమిళనాడుకు పరిమితం కాదు. ఇది యావత్ భారతదేశ ఉమ్మడి సంస్కృతి. ఇతర ప్రపంచ దేశాల్లోనూ దాని ఉనికి ఉంది. ప్రపంచ మానవత్వ వారసత్వంతోనూ తమిళ సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. గతేడాది కూడా తమిళ సంస్కృతితో ముడిపడిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే గొప్ప అవకాశం నాకు లభించింది. తమిళనాడులోని 1000 సంవత్సరాల ప్రాచీన గంగైకొండ చోళపురం ఆలయంలో నేను పూజలు నిర్వహించాను. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించిన 'కాశీ తమిళ సంగమం' కార్యక్రమంలోనూ నేను భాగమయ్యాను. దేశ సాంస్కృతిక ఐకమత్యాన్ని బలోపేతం చేసేందుకు ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంబన్ వంతెనను ప్రారంభించడానికి రామేశ్వరానికి వెళ్లినప్పుడు మరోసారి నేను తమిళ చరిత్ర ఘనతకు సాక్షిగా నిలిచాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

'దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు పొంగల్‌తో పాటు లోహ్రీ, మకర సంక్రాంతి, మాఘ్ బిహు వంటి పండుగలను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. భారత్‌లోని, విదేశాల్లో ఉన్న తమిళ సోదరులు, సోదరీమణులకు నా తరపున హృదయపూర్వక పొంగల్ శుభాకాంక్షలు. ఇదొక కుటుంబపరమైన పండుగ. వికాసం, కృతజ్ఞత, ఐకమత్యం అనే భావనలను కుటుంబాలు సంతోషంగా వ్యక్తపర్చడానికి పొంగల్ వేడుక సరైన సందర్భం' అని ప్రధాని మోదీ తెలిపారు.

**ఏపీ, తెలంగాణ, కర్ణాటక ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ఓ ట్వీట్ చేశారు. పంట చేతికొచ్చే సమయంలో జరిగే ఈ పండుగ భారతదేశ సాంస్కృతిక సుసంపన్నతను అద్దం పడుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విభిన్న రకాలుగా స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా సంక్రాంతి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సంతోషం, వికాసం, ఆరోగ్యాలను ప్రసాదించాలని ఈసందర్భంగా సూర్య భగవానుడిని తాను ప్రార్థిస్తున్నట్లు మోదీ తెలిపారు. ఉత్తరాయణ పుణ్య కాలం వేళ జరిగే సంక్రాంతి వేడుక అందరిలో సామాజిక ఐక్యతా భావాన్ని పెంచాలని, వికాసానికి బాటలు వేయాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తును సానుకూల దృక్పథం, ఆశావాదం, ఆత్మవిశ్వాసంతో చూడాలనే గొప్ప సందేశాన్ని సంక్రాంతి ఇస్తుందన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ప్రజలకు స్థానిక భాషల్లో పొంగల్/సంక్రాంతి శుభాకాంక్షలను తెలుపుతూ ప్రత్యేక లేఖలను ప్రధాని మోదీ రాశారు. చాలామంది జీమెయిల్ ఖాతాలకు ఈ లేఖలు అందాయి. పొంగల్ పండుగను తమిళనాడులో ఘనంగా జరుపుకుంటారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని ప్రజలందరికీ పొంగల్ గిఫ్ట్ ప్యాక్‌లను డీఎంకే సర్కారు పంపిణీ చేస్తోంది. ఈ ప్యాక్‌లో 1 కేజీ ముడి బియ్యం, 1 కేజీ చక్కెర, 1 చెరకు గడ ఉంటాయి. దీంతోపాటు మదురై జిల్లాలోని అవనియాపురం, పాలమేడు, అలంగనల్లూర్‌లలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జల్లికట్టు పోటీలను నిర్వహిస్తారు. జనవరి 15 నుంచి జనవరి 17 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

## రైలుపై భారీ క్రేన్ పడి 22 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి** – థాయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. థాయ్‌లాండ్‌లో కదులుతున్న రైలుపై క్రేన్ జారిపడి పెను ప్రమాదం జరిగింది. నిర్మాణ పనులకు వినియోగించే క్రేన్ పడడంతో రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 22 మంది మృతిచెందగా, మరో 80 మంది గాయపడ్డారు. బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో రైలులో 195 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు. హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం క్రేన్ సాయంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బ్యాంకాక్ నుంచి ఉబాన్ రచతాని రాష్ట్రానికి వెళ్తున్న రైలుపై నిర్మాణ పనుల్లో ఉపయోగించే క్రేన్ పడింది. ఆ తీవ్రతకు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదం జరిగిన వెంటనే కొన్ని బోగీల నుంచి దట్టమైన పొగ, మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పోలీసులు, సహాయ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా శ్రమించి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. బోగీల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు రెస్క్యూ అధికారులు శ్రమిస్తున్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**ప్రమాద సమయంలో రైలులో 195 మంది ప్రయాణికులు**

రైలు ప్రమాదానికి గురైన సమయంలో 195 మంది ఉన్నారని థాయిలాండ్ రవాణ మంత్రి ఫిఫాట్ రాట్చకిత్‌ప్రకర్న్ తెలిపారు. ప్రస్తుతానికి బాధితులను గుర్తించే పనిలో ఉన్నామని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. "సుమారు 9 గంటల సమయంలో పైనుంచి ఏదో కింద పడి పేలినట్లుగా భారీ శబ్దం వచ్చింది. దీంతో వెంటనే అక్కడికి వెళ్లి ఏం జరిగిందని చూశాను. ప్యాసింజర్ రైలులోని మూడు బోగీలపై భారీ క్రేన్ పడిపోయి కనిపించింది. ముఖ్యంగా రెండో బోగీ మధ్యలో క్రేన్ చొచ్చుకుపోయింది." అని స్థానికులు తెలిపారు.

**చైనా సాయంతో చేపట్టిన ప్రాజెక్ట్‌లో ప్రమాదం**

థాయిలాండ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హై-స్పీడ్ రైల్ ప్రాజెక్టులో జరుగుతున్న పనుల్లో ఈ ప్రమాదం జరిగింది. 5.4 బిలియన్ డాలర్లతో చైనా సహకారంతో ఈ ప్రాజెక్ట్ నడుస్తోంది. చైనా 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'లో భాగంగా బ్యాంకాక్‌ను చైనాలోని కున్మింగ్‌తో కలిపేలా ఈ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. దీనిని 2028 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

## ఏపీకి కేంద్రం నిధులు విడుదల

**15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఏపీకి నిధులు విడుదల చేసిన కేంద్రం**

**ఏపీలో ఆరోగ్య రంగానికి రూ. 567 కోట్లు విడుదల చేసిన కేంద్రం**

**నిధుల వినియోగం పెరగడం పట్ల కేంద్రం సంతృప్తిని వ్యక్తం చేసిందన్న సత్యకుమార్**

**మిగులు నిధుల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో చర్చలు ప్రారంభించాలని అధికారులకు ఆదేశం**



ఏపీలోని ఎన్డీయే ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆరోగ్య రంగానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఆఖరి విడతగా రూ. 567 కోట్ల గ్రాంటును కేంద్రం విడుదల చేసింది. ఈ విషయాన్ని ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ... గత 19 నెలల కాలంలో 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 48 శాతం మేర నిధులను వినియోగించడం జరిగిందని తెలిపారు. ఏపీలోని కూటమి ప్రభుత్వంలో నిధుల వినియోగం పెరగడం పట్ల కేంద్ర ప్రభుత్వం సంతృప్తిని వ్యక్తం చేసిందని చెప్పారు. ఇది, ఏపీ ప్రభుత్వానికి కేంద్రం గుర్తింపును ఇచ్చినట్టేనని వ్యాఖ్యానించారు.రాష్ట్ర ఆరోగ్య రంగం మరింత బలోపేతం కావడానికి ఈ నిధులు ఉపయోగపడతాయని మంత్రి చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన మిగుల నిధుల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో వెంటనే చర్చలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి అన్ని రకాలుగా, పూర్తి స్థాయిలో ఆర్థిక సాయాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రుల బలోపేతం, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా పొందిన మూడవ రాష్ట్రంగా ఏపీ అవతరించిందని చెప్పారు.

## తక్షణమే ఇరాన్‌ను వీడండి

**మొదటిపేజీ తరువాయి** – ఇరాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతోన్న ఆందోళనల కారణంగా అక్కడ మారణహోమం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది మృతి చెందగా, అందులో ఆందోళనకారులు 1,850 మంది, భద్రతా దళాల సిబ్బంది 135 మంది ఉన్నారు. ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా పదుల సంఖ్యలో మరణించారు. ఆ దేశంలో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి.ఇరాన్‌లో ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులను అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు (విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు) అందుబాటులో ఉన్న విమానాల ద్వారా వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లిపోవాలి" అని పేర్కొంది.తీవ్రమవుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల కారణంగా టెహ్రాన్‌తో సహా ఇరాన్‌లోని పలు నగరాల్లో పరిస్థితి మరింత దిగజారిందని రాయబార కార్యాలయం హెచ్చరించింది. నిరసన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించింది. రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించాలని భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులకు తెలిపింది.ఆకస్మిక తరలింపు లేదా అత్యవసర ప్రయాణానికి సిద్ధంగా ఉండాలని తెలిపింది. తక్షణ సహాయం కోసం రాయబార కార్యాలయం అత్యవసర సంప్రదింపు ఫోన్ నెంబర్లను, అధికారిక ఈ-మెయిల్ ఐడీని పంచుకుంది. హెల్ప్‌లైన్ నెంబర్లు 98-9128109115, 98-9128109109, 98-9128109102, 98-9932179359 కాగా, ఈ-మెయిల్ ఐడీ ఎశీఅర్.వష్ట్రతీఖఅఏఎఖ.స్త్రశీజ.ఱఅ లను పంచుకుంది.తదుపరి నోటీసు వచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణం చేయవద్దని భారత విదేశాంగ శాఖ కూడా సూచించింది. విదేశాంగ శాఖ ఇంతకుముందు కూడా ఇలాంటి నోటీసు జారీ చేసింది.

## కేసీఆర్‌ను విమర్శించడానికి మేం అవసరం లేదు.. ఆమె చాలు

**మొదటిపేజీ తరువాయి** – రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కేసీఆర్ మాత్రం ఏదో ఒకరోజు మాత్రమే పనుల కోసం సమయం కేటాయించారని విమర్శించారు. అందుకే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. వివిధ పథకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు.మరో ఇరవై రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేని పార్టీలకు ఓటు వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెబుతున్నారని, పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని ఆయన సవాల్ విసిరారు.

## ములుగు జిల్లాను తొలగిస్తారనే ప్రచారాన్ని విశ్వసించవద్దు

**మొదటిపేజీ తరువాయి** – ములుగు జిల్లాను తొలగిస్తున్నారంటూ జరుగుతోన్న ప్రచారంపై మంత్రి సీతక్క స్పందించారు. తెలంగాణలో ఇటీవల జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం చర్చకు దారి తీసింది. వివిధ జిల్లాలు రద్దవుతున్నాయంటూ ఆయా జిల్లాల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఈ ప్రచారాన్ని ఆయా జిల్లాలకు సంబంధించిన అధికార పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు ఖండిస్తున్నారు. జనగామ జిల్లా రద్దవుతోందంటూ రెండు రోజుల క్రితం ప్రచారం జరగగా, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఖండించారు. తాజాగా ములుగు జిల్లాపై అలాంటి ప్రచారం సాగుతోంది.ములుగు జిల్లాను తొలగిస్తున్నారని జరుగుతోన్న ప్రచారాన్ని విశ్వసించవద్దని మంత్రి సీతక్క అన్నారు. పలు యూట్యూబ్ ఛానళ్ల ద్వారా జిల్లాపై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై బురద జల్లేందుకే ఈ విధంగా ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. అందుకే మరోసారి జిల్లాల పునర్విభజన గురించి ముఖ్యమంత్రి మాట్లాడారని తెలిపారు. ములుగు జిల్లా అభివృద్ధిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఆమె తెలిపారు. ఎందరో పోరాటాలు, త్యాగాల వల్ల ములుగు జిల్లా ఏర్పడిందని అన్నారు.

## ఇంత దౌర్జన్యం అవసరమా?

**మొదటిపేజీ తరువాయి** – అపహరించారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆయన ఘాటుగా స్పందించారు."రాహుల్ గాంధీ గారూ.. మీరు నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్' తెలంగాణ శాఖ, పౌరుల రాజ్యాంగ హక్కులను ఎలా కాలరాస్తోందో గమనిస్తు న్నారని ఆశిస్తున్నా" అని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్ర పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అపహరించారని, ఒకరి ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ లోపలికి ప్రవేశిం చారని ఆరోపించారు. కేవలం బెయిల్ ఇవ్వదగిన సెక్షన్లు ఉన్న కేసులో, బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసు లు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. మీడియా, డిజిటల్ మీడియాపై ఈ తరహా అణచివేత ధోరణి ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనకు ఒక నమూనాగా మారిందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# వీరభద్రుడికి వీరబోనం సమర్పించిన శాలివాహనులు

**భక్తిశ్రద్ధలతో నృత్యాల మధ్య ఊరేగింపుగా వీర బోనం**

**బ్రహ్మోత్సవ దర్శనంతో సకల బాధలు తొలగుతాయి : అర్చకులు**

**భక్తులతో కిటకిటలాడిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయం**







**భీమదేవరపల్లి జనవరి 14 (ప్రజా మంటలు) :** భోగి పండగను పురస్కరించుకొని మంగళవారం శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు అరుణ యంత్ర పారాయణ చేసి అనంతరం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అదేవిధంగా కడిపికొండ, దామెర ప్రాంతాలకు చెందిన శాలివాహనులు (కుమ్మరులు) ప్రతి సంవత్సరం వారి ఆనవాయితీ ప్రకారం శ్రీ స్వామివారికి వీర బోనం సమర్పించారు. నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో వీర బోనం అర్పించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీ వీరభద్ర స్వామి వారిని దర్శించుకుంటే సకల బాధలు తొలగి కుటుంబాలకు స్వామివారి ఆశీర్వాదం లభిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ మరియు వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ రామాల సునీత, ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఆలయ ఈవో పి. కిషన్ రావు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహా అన్నప్రసాద వితరణ మొదటిరోజు సక్సెస్

**సంక్రాంతి, కనుమ ప్రత్యేకం**

**కొత్తకొండ జాతర భక్తులకు ఆహ్వానం**

**త్రికూటేశ్వరుని దర్శనంతో పుణ్యఫలం**





**భీమదేవరపల్లి జనవరి 14 (ప్రజా మంటలు) :** ముత్తారం గ్రామంలో ఉన్న త్రికూటేశ్వర ఆలయంలో నిర్వహించిన తొలి రోజు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో 500కు పైగా భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి మరియు కనుమ పర్వదినాల సందర్భంగా కూడా మహా అన్నప్రసాద వితరణ కొనసాగుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మ. 12 గం.ల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు అన్నప్రసాదం సమయాన్ని పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ జాతరకు వచ్చే భక్తులు తప్పకుండా ముత్తారం త్రికూటేశ్వర ఆలయాన్ని దర్శించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ త్రికూటేశ్వరుని దర్శించుకోవడంతో పాటు, బ్రహ్మసూత్రం గల శివలింగాన్ని దర్శించి స్వామివారి కృపకు పాత్రులు కావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవకులు కీలక పాత్ర పోషించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వసతి మరియు శుభ్రత చర్యలు సముచితంగా ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది.

# జాతీయ తెలుగు దినపత్రిక ప్రజా జ్యోతి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలి**

**టి ఆర్ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్**



**ఎల్కతుర్తి జనవరి 14 ప్రజా మంటలు :** ప్రజా గొంతుకగా 'జాతీయ తెలుగు దినపత్రిక నూతన సంవత్సర 2026 ప్రజా జ్యోతి క్యాలెండర్ ను మరియు తెలంగాణ రైతు రక్షణ సమితి వరంగల్ కరీంనగర్ జిల్లాల నూతన సంవత్సర క్యాలెండర్లను ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించిన జాతీయ తెలుగు దినపత్రిక నూతన సంవత్సర 2026వ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తూ సమస్యలను పరిష్కరించడంలో ప్రజా జ్యోతి వార్త పత్రిక ముందు వరసలో ఉందని అభినందించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకు వెళ్లేందుకు జాతీయ తెలుగు దినపత్రిక ప్రజా జ్యోతి పత్రిక దోహదపడాలన్నారు. ప్రభుత్వ పథకాలు చిట్టచివరి లబ్ధిదారునికి చేరడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు పత్రికలు తమ వంతుగా కృషి చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు హింగే భాస్కర్ జాతీయ తెలుగు దినపత్రిక మండల ప్రజా జ్యోతి రిపోర్టర్ శ్రీ రామోజు సతీష్ చారి నీ అభినందించారు. మరియు ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు సాతురిచంద్రమౌళి మాట్లాడుతూ, రైతుల సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువచ్చే విధంగా తెలంగాణ రైతు రక్షణ సమితి పనిచేస్తోందని, ఆ లక్ష్యాలకు బలం ప్రజా సమస్యలపై నిర్భయంగా స్వరం వినిపిస్తోందని పేర్కొన్నారు.రైతు హక్కులు, గ్రామీణ అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల్లోకి చాటిచెప్పడంలో ఈ క్యాలెండర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు కందుకూరి రాజన్న ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సాతూరి చంద్రమౌళి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు శ్రీరామోజు సతీష్ చారి, చిర్ర ఉదయ చందర్, రాజన్న, ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు నల్ల రాజిరెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు సుద్దాల జయప్రసాద్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు బొంకూరి వంశీ, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు అనిల్, మరియు రైతు రక్షణ సమితి జిల్లా సహాయదారుడు సుకినే సుధాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి హంబీర్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కొక్కు తిరుపతి, ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు, భాష బోయిన కుమార్ యాదవ్, ఆర్టీసీ డ్రైవర్ గూడెల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ టివి జర్నలిస్టుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ జగిత్యాలలో నిరసన

**టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ఆధ్వర్యంలో జర్నలిస్టుల ధర్నా**




**జగిత్యాల జనవరి 14 (ప్రజా మంటలు) :** ఎన్ టివి ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు చారి, సుధీర్‌లను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ జగిత్యాల పట్టణంలో టి యు డబ్ల్యూ జే (ఐ జె యు) ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద నిర్వహించిన ఈ ధర్నాలో పాల్గొన్న జర్నలిస్టులు, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యంపై దాడులతో సమానమని తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియాను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు సహించబోమని స్పష్టం చేశారు. నిజాలు వెలుగులోకి తెచ్చే జర్నలిస్టుల గొంతు నొక్కే చర్యలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.అక్రమంగా అరెస్టు చేసిన ఎన్ టి వి జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం టి యు డబ్ల్యూ జే(ఐ జె యు) ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని సంఘ నాయకులు తెలిపారు.ఈ నిరసనలో టీయూడబ్ల్యూజే జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు, గడ్డల హరికృష్ణ, సంపూర్ణ చారి, వేణుగోపాల్, ప్రెస్ క్లబ్ జగిత్యాల టౌన్ అధ్యక్షుడు ఎల్లాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్, సీనియర్ జర్నలిస్ట్ సిహెచ్ వి ప్రభాకర్ రావు, జహీరుద్దీన్, హైదర్ అలీ బండ స్వామి వంశీ కృష్ణ సిరిసిల్ల రాజేంద్ర శర్మ, ఎండి. ఇక్రముద్దీన్ జిల్లాలోని పలువురు జర్నలిస్టులు పాల్గొని నిరసన తెలిపారు.

# ప్రభుత్వ నర్సింగ్ హాస్టల్‌లో ఫోన్లు లాక్కొని విద్యార్థినుల నిర్బంధం



**జగిత్యాల జనవరి 14 ( ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ హాస్టల్‌లో విద్యార్థినుల ఫోన్లు లాక్కొని సంక్రాంతి పండుగకు పంపించకుండా గదుల్లో నిర్బంధించిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటన విద్యార్థినుల స్వేచ్ఛ, భద్రత, మానవ హక్కులపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో.. అదీ బాలికల హాస్టళ్లలో ఇలాంటి చర్యలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. పండుగ అనేది కుటుంబాలతో గడిపే సమయం. అలాంటి వేళ, సరైన ప్రకటన లేకుండా విద్యార్థినుల వ్యక్తిగత కమ్యూనికేషన్‌ను ఆపివేయడం, నిర్బంధం వంటి పరిస్థితులు సృష్టించడం నైతికంగా, పరిపాలనపరంగా సమర్థనీయం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి దృష్టికి వెళ్లగానే ఆమె వెంటనే స్పందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి, హిందూ విద్యార్థినులను తక్షణమే వారి సొంతింటికి పంపించాలని కోరారు. దీనిపై జిల్లా వైద్యాధికారి వెంటనే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విద్యార్థినులపై పాలకులుగా కాకుండా, సంరక్షకులుగా వ్యవహరించాల్సిన బాధ్యత హాస్టల్ నిర్వాహకులది. నియమాలు ఉంటే అవి స్పష్టంగా, సమానంగా, మానవీయంగా అమలవ్వాలన్నారు. మతం, లింగం, నేపథ్యం అనే తేడాలు లేకుండా విద్యార్థినులందరికీ సమాన హక్కులు కల్పించాల్సిందే. ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరగాలని కోరారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్ పరిపాలనపై పర్యవేక్షణ పెంచడం, ఫిర్యాదు వ్యవస్థలను బలోపేతం చేయడం అత్యవసరం. విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకం నిలబడాలంటే.. పండుగ వేళ విద్యార్థినుల కన్నీళ్లు కాకుండా, వారి ముఖాల్లో ఆనందమే కనిపించాలని కోరారు.

## ఆరైవ్ అలవ్ రోడ్డు భద్రత భాగంలో రోడ్డుపైగుంతల పూడ్చివేత



**గొల్లపల్లి జనవరి 14 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం లోని శ్రీరాములపల్లి పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా దారిన పోయే వాహనాలకు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారి, ప్రమాదాలకు దారి తీసే విధంగా ఉండడంతో, ప్రజల రవాణా సౌకర్యార్థం దృష్టిలో ఆరైవ్ అలైవ్ లో భాగంగా మార్కెట్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి , గడ్డం తిరుపతి ల సహకారంతో ఎస్ఐ,కృష్ణ సాగర్ రెడ్డి గుంతలను కంకర సిమెంట్ తో మరమ్మత్తు చేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముదిమాణిక్యం లో సంక్రాంతి సందర్భంగా విద్యుత్ దీపాల ఏర్పాటు



**చిగురుమామిడి జనవరి 14 (ప్రజా మంటలు) :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లోని ముదిమాణిక్యం గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాల పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నూతన విద్యుత్ దీపాలను సిబ్బంది పెంటం రాజు ప్రశాంత్ లతో వేపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోయిని రమేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.అభివృద్ధి విషయంలో ఏలాంటి సమస్యలు ఉన్న తన దృష్టి కి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు.ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు పోతరాజు మునిందర్, జేరిపోతుల పరశురాములు, గ్రామస్తులు జక్కుల స్వామి మాధవరెడ్డి,చీల బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్రికూటేశ్వర ఆలయాన్ని సందర్శించిన కుషాయిగూడ జడ్జి



**భీమదేవరపల్లి జనవరి 14 (ప్రజా మంటలు) :** కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర సందర్భంగా కుషాయిగూడకు చెందిన జడ్జి రాజు కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తెలుగు ప్రయాణంలో భాగంగా త్రికూటేశ్వర ఆలయంను సందర్శించారు. త్రికూటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జడ్జి రాజు, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన త్రికూటేశ్వర ఆలయాన్ని ప్రముఖులు సందర్శించడం ఆనందకరమని, ఇటువంటి సందర్శనలతో ఆలయ ఖ్యాతి మరింత విస్తరిస్తుందని తెలిపారు.

# ఆకట్టుకున్న సందేశాత్మక ముగ్గు




**జగిత్యాల జనవరి 14 (ప్రజా మంటలు) :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం జగిత్యాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో జగిత్యాలకు చెందిన యూట్యూబ్ స్టార్ దేశవేని మమత వేసిన సందేశాత్మక ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది."రైతు లేనిదే రాజ్యం లేదు జవాన్ లేకపోతే దేశానికి రక్షణ లేదు" అనే నినాదంతో, పలు రకాల అందమైన రంగులను వినియోగిస్తూ మమత రూపొందించిన ముగ్గు పలువురి ప్రశంసలను అందుకుంది. ముగ్గు ద్వారా సామాజిక సందేశాన్ని ప్రజలకు చాటగలగడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని మమత తెలిపారు. వివిధ రకాల ఆకర్షణీయమైన, సృజనాత్మక ముగ్గులు వేయడం తన అభిరుచిగా పేర్కొన్నారు.

## ముల్కనూర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన



**భీమదేవరపల్లి, జనవరి 14 (ప్రజా మంటలు) :** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారంగా ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయం ముందు 500 లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేముల శ్రీనివాసులు శంకుస్థాపన చేసి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా గ్రంథాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# కొత్తకొండ ఆలయ అభివృద్ధికి కృషి

**ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ**



**భీమదేవరపల్లి, జనవరి 14 (ప్రజా మంటలు) :** కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆలయ చైర్మన్ బొజ్జపురి అశోక్ ముఖర్జీ తెలిపారు. బుధవారం ఆలయంలో కురుమ సంఘం మండల శాఖ అధ్యక్షులు గౌడ బాలాజీ ఆధ్వర్యంలో చైర్మన్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆలయంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి అభివృద్ధిని వేగవంతం చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కంకల సమ్మయ్య, గుంటి ఓదేలు, చివ్వాల బుచ్చయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ





**గొల్లపల్లి జనవరి 14 ప్రజా మంటలు :** ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసిన మార్కెట్ చైర్మన్ భీమా సంతోష్ సంక్రాంతి పండుగ మన తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మార్కెట్ చైర్మన్ భీమా సంతోష్ అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని మల్లన్నపేట గ్రామంలో ఉప సర్పంచ్ ముత్యాల స్వామి ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి తో కలిసి మార్కెట్ చైర్మన్ భీమా సంతోష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన గుండా శ్వేతా కు మొదటి బహుమతిగా గ్యాస్ స్టవ్, దాసరి కార్తీక కు రెండో బహుమతిగా ప్రెషర్ కుక్కర్, మూడో బహుమతి తోట మాధవి కి ఐరన్ బాక్స్, నాలుగో బహుమతి నమిలికొండ అవిఘ్న వాటర్ హీటర్ లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా విజేతలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మాజీ సర్పంచ్ లు చిర్ర గంగాధర్,పురంశెట్టి వెంకటేశం, బేరా కిషోర్,వార్డ్ సభ్యులు బాలయ్య, మహేష్ నాయకులు కొండ్రా గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత యువత పై కేసు నమోదు




**గొల్లపల్లి జనవరి 14 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం లోనీ చందోలి గ్రామ శివారులో యువకుడు గంజాయితో వెళుతున్నాడని పక్క సమాచారం మేరకు చందోలి శివారులో పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా యువకుడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతడి వద్ద 89 గ్రాముల గంజాయి లభించగా వివరాల్లోకెళ్తే వెల్గటూర్ మండలశీ లోని జగదేవ్ పేట గ్రామానికి చెందిన బచ్చల రామ్ చరణ్ ను విచారించగా చెడు వ్యసనాలకి బానిస అయి,తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఆలోచనతో ఎండపల్లి మండలశీ లోని కొత్తపేట గ్రామానికి చెందిన సాయి సిద్ధు వర్ధన్ వ్యక్తి దగ్గర నుండి గంజాయి కొనుక్కొని, ఎక్కువ ధరకి విక్రయిస్తానని తెలిపాడు సాయి సిద్ధు వర్ధన్ రామ్ చరణ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ, కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## చాపగాని తండాలో వీధి దీపాల ఏర్పాటు

**గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా , సర్పంచ్ గుగులోతు రాజేందర్**



**అక్కన్నపేట జనవరి 14 (ప్రజా మంటలు) :** అక్కన్నపేట మండలం, చాపగాని తండాలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీధి దీపాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. తండా పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో అవసరమైన చోట్ల కొత్తగా వీధి లైట్లు ఏర్పాటు చేయించడంతో రాత్రి వేళల్లో వెలుతురు సమస్య తీరనుంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగులోతు రాజేందర్ మాట్లాడుతూ, తండా ప్రజలు ఎన్నాళ్లుగానో కోరుతున్న వీధి దీపాల సమస్యను పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ నిధులతో పాటు ప్రభుత్వ సహకారంతో ఈ పనులు చేపట్టామని తెలిపారు. వీధి దీపాల వల్ల రాత్రి సమయంలో ప్రమాదాలు తగ్గడంతో పాటు మహిళలు, వృద్ధులు భద్రంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. గ్రామపంచాయతీ సభ్యులు, స్థానిక నాయకులు, తండా వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిన సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తామని గ్రామ పాలకవర్గం వెల్లడించింది.

# పందెం కోళ్లను బరిలో దింపడానికి ఓ లెక్కుంది

**అదే కుక్కుట శాస్త్రం**

**కోళ్ల కోసం రాసిన పంచాంగమే కుక్కుటశాస్త్రం**

**సంస్కృతంలో కుక్కుటం అంటే కోడిపుంజు అని అర్థం**

**బరిలోకి దింపేటప్పుడు తప్పనిసరిగా కుక్కుట శాస్త్రం అధ్యయనం**



సమరానికి సై అనే సంక్రాతి పందెం కోళ్లకు ఓ ప్రత్యేక శాస్త్రమే ఉంది. దీనికి రాసిన పంచాంగాన్నే కుక్కుటశాస్త్రం అంటారు. సంస్కృతంలో కుక్కుటం అంటే కోడిపుంజు అని అర్థం. పందెం రాయుళ్లు పుంజులను బరిలోకి దింపేటప్పుడు కుక్కుట శాస్త్రాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేస్తుంటారు. ఏ కోడిపై ఏ కోడిని దింపితే ఫలితం బాగుంటుందీ అనే అంచనాలు ఈ బరిలో ఎక్కువే. అసలు పందెం కోళ్లు ఎన్ని రకాలు, వాటి తీరు తెన్నులేంటి అనేదానిపై ఈటీవీ ప్రత్యేక కథనం.ఏడాదిన్నర పాటు శిక్షణ : కోడి పందెంలో రెండు అంశాలది కీలక పాత్ర. ఒకటి కోడి జాతి. రెండు దానికి ఇచ్చే శిక్షణ. కోడి పుంజుల్లో తెల్ల నెమలి, కోడి నెమలి, గౌడ నెమలి, కాకి డేగ, నెమలి కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు ఉంటాయి. రెక్కల రంగు, ఇతర శారీరక లక్షణాల ఆధారంగా వీటిని వర్గీకరిస్తారు. ముందుగానే వీటిని ఎంపిక చేసుకుని దాదాపు ఏడాదిన్నర పాటు శిక్షణ ఇచ్చి పందెం బరిలోకి దింపుతుంటారు.వారాలు, పక్షాలను అనుసరించి : కోడిని ఏ దిక్కు నుంచి బరిలోకి దించితే విజయం సాధిస్తుందనే అంశంలో పందెంరాయుళ్లు కొన్ని నమ్మకాలను అనుసరిస్తారు. వారాలు, పక్షాలను అనుసరించి కొన్ని జాతుల కోడి పుంజుల జీర్ణశక్తి మందగిస్తుందని అంచనా కూడా ఉంది. ఆ సమయంలో పందేనికి దింపితే కోడి అపజయం పాలవుతుందని నమ్మే వారు ఉన్నారు. డేగ జాతి కోళ్లు పోరాట పటిమకు పెట్టింది పేరు. ఇవి చూడముచ్చటగా ఉండటంతో పాటు ఎంతో చురుకుగా కదులుతాయి.నెమలి జాతి కోళ్లు 3కేజీల వరకూ తూగుతాయి. మంచి కండపుష్టి ఉండటంతోపాటు కళ్లు చురుకుగా ఉంటాయి. కాలి గోళ్లు చాలా బలంగా, మొనదేలి ఉంటాయి.తాళపత్ర గ్రంథాలు సాక్ష్యం : కోడిపందాలు ప్రాచీన సంప్రదాయమనేందుకు తాళపత్ర గ్రంథాలు సాక్ష్యమని పందెం రాయిళ్ల అంచనా. కోడి పుంజులు, వాటి రకాలు, ఏ రకం పుంజు పోరాట లక్షణం ఏమిటి, ఏ రకం పుంజుపై ఏ రకాన్ని బరి లోదించితే విజయావకాశాలు ఉంటాయనే వివరాలు సైతం ప్రాచీన తాళ పత్ర గ్రంథాల్లో లభిస్తాయని గుర్తు చేస్తారు.పందెం వేసే రోజున నక్షత్రాన్ని బట్టి తారాబలం చూసి కోడి రంగు, జాతిని ఎంపిక చేసి ఆ రోజున ఏ పుంజుతో పందెం వేయాలో ఆ రంగు ఉన్న కోడి పుంజుతోనే పందేలు వేస్తారు. భోగి సందర్భంగా గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు గెలుపొందుతాయని, సంక్రాంతి రోజు యాసర కాకి డేగలు, కాకి నెమలిలు, పసిమగల్ల కాకులు, కాకి డేగలకు చెందిన పుంజులు గెలుపొందితే, కనుమ నాడు డేగలు, ఎర్రకాకి డేగలు గెలుపొందుతాయని కోడిపందాల్లో ప్రావీణ్యం ఉన్న వారి నమ్మకం.కోళ్లను గుర్తించడం ఓ నైపుణ్యం : బరిలో ఓడి చనిపోయిన కోడి మాంసానికి విపరీతమైన గిరాకీ ఉంటుంది. వేలంపాట పెట్టి మరీ కొనుగోళ్లు జరిపే సందర్భాలు ఉంటాయి. గ్రామాల్లో పందెం కోళ్లను గుర్తించడం ఓ నైపుణ్యంగా భావిస్తారు. పందెం కోళ్లను గుర్తించడం, వాటిని పోటీలకు సిద్ధం చేయడమే వృత్తిగా జీవిస్తున్నవారు ఎందరో ఉన్నారు.బరిలోకి దింపే ఈ పందెంకోళ్లలో కొన్ని నియమాలు తప్పనిసరి. రెండు కోళ్ల బరవు ఇంచుమించుగా సమతూకం ఉండాలి. ఉండాల్సిన బరువుకన్నా ఎక్కువ తక్కువలున్నా తేడాలొస్తాయి. పందెం పుంజు ఒంటి గట్టితనం అన్నింటికన్నా ముఖ్యం. అందుకే చన్నీటిని నోటిలోకి తీసుకుని కోడి మీదకు ఊదుతారు. అలా చేస్తే దాని శరీరం గట్టిపడుతుందని ఓ నమ్మకం. బరిలో దిగిన కోడి గెలిస్తే ప్రపంచాన్ని జయించిన ఆనందం, ఓడిపోతే తట్టుకోలేని అవమానాలు ఇక్కడ సర్వసాధారణం. మెడమీద ఈకలు రెక్కించి పౌరుషం కళ్లల్లో కదలాడే కోడి పుంజు ఒక్క ఉదుటున గాలిలోకి లేచి ప్రత్యర్థిని దెబ్బతీసే దృశ్యం తిలకించే కిక్కే వేరు.

# డ్రగ్స్ ముఠాలను తరిమేందుకు కొత్త అస్త్రం

**'ఐరిస్'తో ఆ రిస్క్‌కు తెలంగాణ చెక్**

**డ్రగ్స్ దందాతో అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న విదేశీయులు**

**వీసా గడువు ముగిసినా దేశంలోనే తిష్ఠ**

**వారిని డిపోర్ట్ చేసేందుకు పక్కా ప్రణాళిక**

**నకిలీ పాస్‌పోర్టులతో మళ్లీ రాకుండా కార్యాచరణ**



విద్య, ఉపాధి కోసం దేశానికి వచ్చాం అంటారు. పైకి వారి పనిలో ఉన్నట్లుగా కనిపించినా, వారి అసలు రూపం వేరే ఉంటుంది. వీసా గడువు ముగిసినప్పటికీ వారు దేశాన్ని వీడకుండా ఇక్కడే ఉంటూ దందా సాగిస్తూ ఉంటారు. దేశంలో ప్రధాన నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి నగరాల్లోని యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తూ అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తూ ఉంటారు. అయితే ఈ రకంగా దేశంలోకి వచ్చి డ్రగ్స్ (మాదక ద్రవ్యాల) దందాతో పాటు ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న విదేశీయులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం 'ఐరిస్' అస్త్రాన్ని ప్రయోగిస్తోంది.ముఖ్యంగా అక్రమంగా ఉంటున్న నైజీరియన్ల విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ విషయంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఈగల్) పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్ఠ వేసి, డ్రగ్స్ దందా కొనసాగిస్తున్న వారిని నియంత్రించేందుకు డిపోర్టేషన్ (స్వదేశానికి తిప్పి పంపడం) ప్రక్రియకు పదును పెడుతున్నారు. ఈ సమయంలోనే ఐరిస్ అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా నకిలీ పాస్ పోర్టులతో మళ్లీ దేశంలోకి అడుగుపెట్టే అవకాశం లేకుండా చేస్తున్నారు.వీసా గడువు ముగిసేలోపే : దేశంలో మాదక ద్రవ్యాల దందాలో ఆఫ్రికా దేశస్థులే కీలకం. ముఖ్యంగా నైజీరియన్లే ఎక్కువ. స్టూడెంట్, మెడికల్, టూరిస్ట్ లాంటి వీసాలతో అడుగు పెడుతున్న వీరిలో కొందరు కేవలం డ్రగ్స్ దందా కోసమే వస్తున్నారు. దిల్లీ, ముంబయి, బెంగళూరు, గోవా, హైదరాబాద్ వంటి నగరాల్లో తిష్ఠవేసి, దందా సాగిస్తున్నారు. ఇలా దేశంలోకి అడుగుపెట్టిన వెంటనే సంబంధిత ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్వో)లో తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయించాలి. వీసా గడువు ముగిసేలోపు తిరిగి వెళ్లిపోవాలి. అయితే కొందరు మాత్రం వీసా గడువు ముగిసినా వెళ్లిపోకుండా దేశంలో అక్రమంగా ఉండిపోతున్నారు (ఓవర్ స్టే). డ్రగ్స్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. ఈగల్ బృందం ప్రత్యేక కార్యాచరణ : ఇలాంటి వారిని గుర్తించి డిపోర్ట్ చేయడంలో ఈగల్ బృందం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. 'ఓవర్ స్టే'పై కొనసాగుతున్న వారిని గుర్తించి ఆయా రాష్ట్రాల పోలీసులకు అప్పగిస్తోంది. కొద్దిరోజుల క్రితం దిల్లీలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఇలా 30 మంది ఆఫ్రికన్లు చిక్కితే వారిలో ఏడుగురిని మాత్రమే హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. వారి వద్ద డ్రగ్స్ దొరకడంతో అరెస్ట్ చేసింది. మిగిలిన వారిని దిల్లీ పోలీసులకు అప్పగించింది. దిల్లీ పోలీసులతో పాటు విదేశీ వ్యవహారాల శాఖ వారందరినీ ఆఫ్రికా దేశాలకు పంపే పనిలో నిమగ్నమైంది.మరోసారి అడుగుపెట్టే అవకాశం లేకుండా : ఇలా డిపోర్ట్ అయిన వారిలో కొందరు నకిలీ పాస్‌పోర్టులపై తిరిగి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. పలువురు ఆఫ్రికన్లు, ముఖ్యంగా నైజీరియన్లు సెనెగల్ వంటి ఇతర దేశాల పౌరులుగా నకిలీ పాస్‌పోర్టులు పొంది వచ్చినట్లు వెల్లడైంది. అలాంటి నైజీరియన్లు మరోసారి దేశంలో అడుగుపెట్టే అవకాశం లేకుండా డిపోర్టేషన్ సమయంలోనే వారి బయోమెట్రిక్‌తో పాటు ఐరిస్ సేకరించే విధానాన్ని దేశవ్యాప్తంగా ఎఫ్ఆర్ఆర్వో కార్యాలయాల్లో పక్కాగా అమలు చేస్తున్నారు. ఏడాది వ్యవధిలోనే దేశవ్యాప్తంగా 2,371 మందిని డిపోర్టేషన్‌పై పంపిస్తే వారిలో 1,470 మంది నైజీరియన్లే ఉండటం గమనార్హం. తెలంగాణ నుంచి గత ఏడాది 76 మందిని ఎఫ్ఆర్ఆర్వో ద్వారా ఈగల్ బృందం డిపోర్ట్ చేయించింది.ఆ కేసు దర్యాప్తులో వెలుగులోనికి : గత ఏడాది జులైలో హైదరాబాద్ కొంపల్లిలోని ఓ రెస్టారెంట్ నిర్వాహకుడిని ఈగల్ బృందం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. దిల్లీ నుంచి అతడికి వచ్చిన కొరియర్‌లో కొకైన్ ఉందనే సమాచారంతో ఈగల్ పోలీసులు వల పన్ని అతడిని పట్టుకున్నారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలు వెలుగులోనికి వచ్చాయి. పలు మెట్రో నగరాల్లో మకాం వేసిన నైజీరియన్లతో డ్రగ్ కార్టెల్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు.

# ముగిసిన గండికోట వారసత్వ ఉత్సవాలు

**అలరించిన డ్రమ్స్ కళాకారుడు శివమణి ప్రదర్శన**

**3 రోజుల పాటు వేడుకగా గండికోట వారసత్వ ఉత్సవాల నిర్వహణ**

**ముగింపు రోజు ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు కిరణ్ అబ్బవరం**

**హెలీరైడ్‌లో గండికోట అందాలను తిలకించిన పర్యాటకులు**




వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని చారిత్రక గండికోటలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగిన గండికోట వారసత్వ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. పర్యాటక ప్రాధాన్యాన్ని చాటేలా కళా, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.ఉత్సవాల చివరిచివరి రోజు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లాకు చెందిన సినీనటుడు కిరణ్ అబ్బవరం యువకులంతా సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే దేన్నైనా సాధిస్తారని సందేశమిచ్చారు. ప్రముఖ డ్రమ్స్ కళాకారుడు శివమణి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చివరిరోజు హెలికాప్టర్ రైడ్‌కు పర్యాటకులు పోటెత్తారు. చారిత్రక కట్టడం గండికోటలో 3 రోజుల పాటు సాగిన వారసత్వ ఉత్సవాల్లో చివరి రోజు సంబరాలు అంబరాన్నంటాయి. గండికోట ప్రాశస్త్యంపై కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన డోమ్‌ను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.ఉర్రూతలూగించిన హెలీరైడ్ : ప్రముఖ డ్రమ్స్ కళాకారుడు శివమణి ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. వందల మంది హెలీరైడ్‌లో పాల్గొని గండికోట అందాలను తిలకించారు. దీనికితోడు మైలవరం డ్యాంలో బోటు షికారు ఆకట్టుకుంది. ఉత్సవాలకు విచ్చేసిన పర్యాటకులు, పిల్లలు, మహిళలకు మూడు రోజుల పాటు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి బహుమతులు అందజేశారు.ప్రధాన వేదిక పైన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్లో జోష్ నింపాయి. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి ప్రదర్శన అలరించింది. మూడు రోజుల పాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేడుకలు నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు, అధికారులకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ ధన్యవాదాలు తెలిపారు. గండికోటలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు.నటుడు కిరణ్ అబ్బవరం సందడి : గండికోట ఉత్సవాల చివరి రోజు కడప జిల్లాకు చెందిన సినీనటుడు కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథిగా వేడుకలకు హాజరయ్యారు. సినిమాల్లోకి రావడానికి తాను కూడా చాలా కష్టపడ్డానని, తన సినిమాలను ఆదరిస్తున్న యువతకు, ముఖ్యంగా కడపజిల్లా వాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేటితరం యువకులు సంకల్పం పెట్టుకుని సాధించాలనే కసితో ముందుకు వెళ్తే దేన్నైనా సాధించగలరని కిరణ్ అబ్బవరం సూచించారు. మూడురోజుల పాటు గండికోట వారసత్వ ఉత్సవాలు వైభవంగా నిర్వహించడంతో పర్యాటకులు సంతృప్తి వ్యక్తం చేశారు. గండికోటను పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.సాహస క్రీడలకు వేదికగా : గండికోట ఉత్సవాల్లో భాగంగా పర్యాటకులకు కొత్త అనుభూతి పంచేందుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేసింది టూరిజం శాఖ. సాహస క్రీడలకూ ఇది వేదికగా నిలిచింది. రకరకాల సాహస క్రీడలు నిర్వహించేందుకు వీలుగా ఉందీ ప్రాంతం. అందుకే ఇక్కడ అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశారు. ర్యాప్లింగ్, క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి ప్రదేశాలకు అందమైన కొండలు నెలవుగా మారాయి. పెన్నానదిలో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించారు. వీటితోపాటు ప్యారామోటర్, హెలికాప్టర్ రైడ్ లాంటివీ ఉన్నాయి. అందుకే పర్యాటకులు ఇక్కడికి వెళ్లేందుకు ఆసక్తిగా నిలిచాయి.

# హద్దు మీరితే రౌడీ షీట్ గ్యారెంటీ




శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా ఘర్షణలు, దాడులకు దిగేవారిపై తెరిచే సస్పెక్ట్, హిస్టరీషీట్లు అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గత ఏడాది (2025)లో భారీగా పెరగడమే ఇందుకు నిదర్శనం. చీటికీమాటికీ దాడులకు దిగడం ఇప్పుడు మామూలు అయిపోయింది. వెబ్‌సిరీస్, సినిమాల ప్రభావంతో ముఖ్యంగా యువత ప్రతి చిన్నదానికీ ఘర్షణకు దిగుతున్నారని నిపుణలు అంటున్నారు. విద్యార్థులు ముఠాలుగా ఏర్పడి కొట్టుకోవడం, ర్యాగింగ్ పేరుతో సహచరుడ్ని బంధించి హింసించడం మామూలు అయిపోయిది. ఇక అడ్డగోలుగా వాహనాలు నడుపుతున్న వారిని అదేమిటని అడిగినా, ఇంటి ముందు పార్కు చేసిన కారు తీయాలని అడిగినా పిడిగుద్దులతో జవాబు ఇవ్వడం సాధారణ అంశంగా మారింది. ఇది ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా మారుతోంది. ఒక్కసారి ఇలాంటి గొడవలకు దిగిన తరువాత పోలీసుల నుంచి ఎలాంటి చర్యలు సైతం లేకపోతే నిందితుల్లో ధైర్యం వస్తోంది. క్రమంగా బెదిరింపులు, ఆ తరువాత దాడులకు దిగడానికి సిద్ధం అవుతున్నారు. ఈ కాలక్రమంలో వీరే కరడుగట్టిన నేరగాళ్లుగా తయారవుతున్నారు. కిరాయికి హత్యలు చేసేవరకూ వెళ్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ దాడులు, ఘర్షణలకు దిగుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతోంది. 2025 సంవత్సరంలో 4,359 మందిపై సస్పెక్ట్ షీట్లు, 5,348 మందిపై హిస్టరీ షీట్లు తెరిచింది.హిస్టరీషీట్ తెరిస్తే ఏమవుతుందంటే : నేరాలకు పాల్పడుతున్నట్లు తేలితే తొలుత సస్పెక్ట్ షీట్ తెరుస్తారు. అప్పటి నుంచి ఎక్కడ నేరం జరిగినా సస్పెక్ట్ షీట్లో పేర్లు ఉన్నవారిని విచారిస్తారు. వారిపై పోలీసుల నిఘా కొనసాగుతుంటుంది. అయినా మార్పు రాకపోతే హిస్టరీ షీట్ తెరుస్తారు. దీన్నే రౌడీషీట్ అంటారు. ఒక్కసారి రౌడీషీట్ తెరిచిన తర్వాత క్రమం తప్పకుండా స్థానిక పోలీస్‌స్టేషన్లో హాజరుకావాల్సి ఉంటుంది. ఏదైనా శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు హిస్టరీ షీట్ ఉన్నవారందర్నీ ముందస్తు అరెస్టులు చేస్తుంటారు. వీరిపై అనేక ఆంక్షలు పెడతారు. అలానే కొన్ని ప్రాంతాల్లో రాజకీయ స్పర్థలు, భూవివాదాలు, ఆర్థికపరమైన లావాదేవీల కారణంగా ముఠాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం కూడా పెరిగిపోయింది. ఇటువంటప్పుడు ముఠాలో ఉన్న వారందరిపై గ్యాంగ్‌ఫైల్స్ తెరుస్తున్నారు.

## కాళేశ్వరం ఆనకట్టల పునరుద్ధరణపై సర్కార్ దృష్టి

**వచ్చే నెల నుంచి పనులు!**

**నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణపై సర్కార్ దృష్టి**

**కేంద్ర జలసంఘం మార్గదర్శకాలకు అనుగుణంగానే మరమ్మతులు**



కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణపై సర్కార్ దృష్టి పెట్టింది. కేంద్ర జలసంఘం మార్గదర్శకాలకు అనుగుణంగానే మరమ్మతులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరమ్మతులకు డిజైన్లు అందించేందుకు బాంబే ఐఐటీ భాగస్వామ్యంతో ముందుకొచ్చిన ఆఫ్రీ ఇండియాను ఎంపిక చేసినట్లు నీటి పారుదల అధికారులు సీఎంకు చెప్పారు. వచ్చే నెల నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆనకట్టలతో పాటు ప్రాజెక్టులపై సీఎం సమీక్ష : రాష్ట్రంలోని ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు, ఇంజినీర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. శుక్రవారం ప్రారంభించనున్న చనకా-కొరాటా, సదర్మాట్ ఆనకట్టలతో పాటు చిన్న కాళేశ్వరం, దేవాదుల సహా గోదావరి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టు, ఇంకా చేయాల్సిన భూసేకరణ, అందుకోసం అవసరమయ్యే వ్యయం తదితర అంశాల గురించి ఆరా తీశారు.ఆనకట్టల మరమ్మతుల ప్రక్రియలపై సీఎం ఆరా : వీలైనంత త్వరగా భూసేకరణ సహా పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీరు అందించాలని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన నిధులను విడుదల చేస్తామని పేర్కొన్నారు. భూసేకరణ కోసం నిధుల ఇబ్బంది ఉండబోదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని ఆనకట్టల మరమ్మతుల ప్రక్రియ పురోగతిపైనా సీఎం ఆరా తీశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతుల కోసం డిజైన్ కన్సల్టెన్సీని ఖరారు చేసినట్లు అధికారులు వివరించారు. బాంబే ఐఐటీ భాగస్వామ్యంతో వచ్చిన ఆఫ్రీ ఇండియాను ఎంపిక చేసినట్లు చెప్పారు.పూర్తి స్పష్టత తర్వాతే ప్రక్రియ ప్రారంభం : ఇప్పటికే సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆధ్వర్యంలో మూడు ఆనకట్టల వద్ద పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు. అన్నారం, సుందిళ్లలో ఫిబ్రవరి నుంచి అన్ని పనులు సమాంతరంగా చేపట్టాలని భావిస్తున్నట్లు వివరించారు. మేడిగడ్డ విషయంలో పూర్తి అవగాహన, స్పష్టత వచ్చిన తర్వాతే మరమ్మతుల ప్రక్రియ ప్రారంభించాలని భావిస్తున్నారు. కన్సల్టెన్సీ ఇచ్చిన డిజైన్లను కేంద్ర జల సంఘం పరిశీలించి ఆమోదించిన తర్వాతే మరమ్మతుల విషయంలో ముందుకెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. పోలవరం-నల్లమలసాగర్‌కు సంబంధించి సుప్రీంకోర్టు విచారణలో వచ్చిన అంశాలు, తదుపరి కార్యాచరణ సహా ఇతర అంశాలపై ముఖ్యమంత్రి చర్చించినట్లు సమాచారం.కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేత దృష్టి : కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. సుమారు రూ.లక్ష కోట్లు వ్యయం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ముందుకెళ్లే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. కుంగిన మేడిగడ్డ సీపేజీ, ఇసుకమేట సమస్య ఎదుర్కొంటున్న ఇతర బ్యారేజీల విషయంపై దృష్టి సారించింది. ఎన్‌డీఎస్ఏ సిఫార్సుల అమలు, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, విజిలెన్స్ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటూనే, ఇతర పనులను చేయాలని నిర్ణయించింది. ఇందులో ప్రత్యేకించి ఎల్లంపల్లి నుంచి దిగువన అన్ని రకాల పనులను పూర్తి చేసి, ఆ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడానికి ఏం చర్యలు తీసుకోవాలన్న అంశంపై ప్రణాళికలు చేస్తుంది.నీటిని మళ్లించే పనులపై పూర్తి నివేదిక : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలకు బాధ్యులపై చర్యలు చేపడుతూనే, మిగిలిన పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించడాన్ని వేర్వేరుగా చూడాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని మళ్లించడం, అలాగే ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు 2 టీఎంసీల నీటిని తీసుకురావడం వంటి పనుల పూర్తిపై నివేదిక ఇవ్వాలని నీటి పారుదల శాఖను ముఖ్యమంత్రి కార్యాలయం కోరినట్లు సమాచారం. అలాగే మల్లన్నసాగర్ నుంచి రంగారెడ్డి జిల్లాకు నీటిని మళ్లించే పనుల పూర్తి నివేదికను కూడా కోరినట్లు తెలిసింది.

## రుసుములు ఎగ్గొట్టేందుకు వాహనాలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్టిక్కర్లు

**టోల్‌ప్లాజాల వద్ద అనధికార 'వీఐపీ'లు**

**టోల్ ప్లాజాల వద్ద నిబంధనలను ఉల్లంఘిస్తున్న అనధికార వీఐపీలు**

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేరిట స్టిక్కర్లు వేసుకుని టోల్ రుసుము ఎగవేత**

**పదుల సంఖ్యలో అనధికార వాహనాలు గుర్తించి కేసులు నమోదు**



పండగ వేళ చాలా మంది సొంత వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. అయితే ఇలాంటి సందర్భాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తారని, చెక్‌పోస్టులు ఉంటాయని చాలా మంది భయపడుతూ ఉంటారు. తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ప్రధాన మార్గాల్లో కాకుండా వీధుల్లో వాహనాన్ని నడుపుతారు. అయితే కొంతమంది మాత్రం వీటికి భయపడకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతుంటారు. వాహనాలకు ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించినవిగా స్టిక్కర్లు అతికించి, యథేచ్ఛగా తిరిగేస్తున్నారు. టోల్ ప్లాజాల వద్ద రుసుము చెల్లించడానికి నిరాకరిస్తున్నారు. అయితే ఇలా అక్రమాలకు పాల్పడే వారిపై అధికారులు దృష్టి సారించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే,టోల్ రుసుములను ఎగ్గొట్టేందుకు : సంక్రాంతి వేళ టోల్‌ప్లాజాల వద్ద నిబంధనలను అనధికార 'వీఐపీ'లు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఫలానా ప్రజా ప్రతినిధులకు చెందిన వాహనమని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేరిట స్టిక్కర్లు వేసుకుని ఈ కార్లు వారివే అని బుకాయిస్తున్నారు. టోల్ రుసుములు చెల్లించాలని చెబితే ససేమిరా ఒప్పుకోవడం లేదు.ఇలాంటి వారి కారణంగా ట్రాఫిక్ మరింత రద్దీగా మారిపోతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సిబ్బంది వారిని రుసుము వసూలు చేయకుండానే వదిలివేస్తున్నారు. ఇదే అదనుగా కొందరు ప్రభుత్వం కల్పించే ఉచిత టోల్‌గేట్ అనుమతులు కూడా దుర్వినియోగం చేస్తున్నారు అనే ఆరోపణలు వస్తున్నాయి. టోల్‌ప్లాజాల వద్ద పోలీస్, అంబులెన్స్ సైరన్‌లను వినియోగిస్తుండటంతో తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయి. అమలులోనికి రాని నిబంధన : ప్రతి శాసనమండలి సభ్యుడికి గతంలో ఐదు స్టిక్కర్లు అందజేస్తే వాటిని మూడింటికి తగ్గించాలనే నిబంధన ఉన్నా అది అమలు కావడం లేదు. గతంలోనూ శాసనసభ్యుల స్టిక్కర్లు ఉన్న వాహనాలు అనధికార, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు తరచూ ఫిర్యాదులు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేడు మరింత ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశాలుండటంతో టోల్ రుసుములను ఎగ్గొట్టేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.టోల్‌ప్లాజాల నకిలీ ప్రజా ప్రతినిధుల కార్లలో : హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు ముందుగా పంతంగి టోల్‌గేట్ దాటి అక్కడి నుంచి నార్కట్‌పల్లి, మిర్యాలగూడ మీదుగా అద్దంకి, ఒంగోలు, ప్రకాశం, నెల్లూరు వైపు మొత్తం 10 టోల్‌బూత్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలు బారులు తీరిన వేళ పైరవీల గోల ప్రయాణికులకు చికాకు పెట్టిస్తున్నారు. టోల్‌ప్లాజాల వద్ద వీఐపీ, నకిలీ ప్రజా ప్రతినిధుల కార్ల పై వీరి గోల మాత్రం తగ్గడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు.కేసులు నమోదు చేస్తున్నాం : ప్రజా ప్రతినిధులకు సంబంధించిన టోల్‌పాసులు దుర్వినియోగం చేసినా, అనధికారంగా హారన్‌లు వినియోగించిన నిర్వాహకులు మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని నల్గొండ అదనపు ఎస్పీ రమేశ్ అన్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో అనధికార వాహనాలు గుర్తించి కేసులు నమోదు చేశామని వెల్లడించారు.చర్యలు తీసుకోవాలి : ఎవరు పడితే వారు తమ వాహనాల నంబరు ప్లేట్లపై పోలీసు కమిషనర్, ఎమ్మెల్యేలు అని స్టిక్కర్లు వేయిస్తున్నారు. ఆపై సైరన్లు వినియోగిస్తూ రోడ్ల పై ప్రయాణిస్తున్నారు. ఈ రకంగా నిబంధనలను అతిక్రమిస్తున్న వారిపై పోలీసు, ఆర్టీవో, ఆర్అండ్‌బీ, ట్రాఫిక్ శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఇటీవల మండలి సమావేశాల్లో సంబంధిత మంత్రులతో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUG-GARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com